కెమిస్ట్రీలో కరుణారెడ్డికి డాక్టరేట్


చెప్యాల కరుణారెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కెమిస్ట్రీ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న చెప్యాల కరుణారెడ్డికి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ సీహెచ్ వెంకటరమణా రెడ్డి నేతృత్వంలో 'డిజైన్ సింథసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ ఇండోల్, థైజోలోపిరిడైన్ బేస్డ్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్ అండ్ బయోలాజికల్ స్టడీస్' అంశంపై కరుణ ఐదేళ్ల పాటు చేసిన పరిశోధనకు వర్సిటీ ఉన్నతాధికారులు మంగళవారం ఆమోదం తెలిపారు. జనగాం జిల్లా కట్కూర్ గ్రామానికి చెందిన కరుణ, ఇంతకు మునుపు జేఎన్‌టీయూలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివి యూనివర్సిటీ టాపర్‌గా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. పీహెచ్‌డీ డాక్టరేట్ పొందిన కరుణారెడ్డికి జేఎన్‌టీయూ కాలేజీ కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.


శ్మశానవాటికలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన

హైదర్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.50లక్షలతో బర్నింగ్ ప్లాట్‌ఫాం, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, రూ.కోటి నిధులతో సిట్టింగ్ గ్యాలరీ, పూజ గది, సెక్యూరిటీ రూమ్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటినంత త్వరగా పూర్తి చేసి శ్మశాన వాటికను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దహన సంస్కారాల కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. త్వరలో వాచ్‌మెన్ రూం, పూజ గది నిర్మాణ పనులు కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సమ్మారెడ్డి, రవి, మల్లేష్, షౌకత్ అలీ మున్నా, ముజీబ్, అగ్రవాసు, మహేష్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. పాహిమాం

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం


ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో అమ్మవారి పూజలో పాల్గొన్న అసిస్టెంట్ మేనేజర్ మంగమూరి హరికృష్ణ, కుటుంబ సభ్యులు


భరత్‌నగర్‌లో శ్రీసాయిగణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు


జవహర్‌నగర్ కనకదుర్గా ఆలయంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు

కూకట్‌పల్లి జోన్ బృందం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలతో పాటు మండపాలలో కొలువు దీరిన అమ్మవారిని కాలనీవాసులు ఉదయం నుంచే దర్శించుకున్నారు. కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని విజయదుర్గా రామలింగేశ్వర ఆలయంలో కనకదుర్గమ్మ మీనాక్షి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వీవీఎన్‌ఆర్ పార్కులో గాజుల సంబరాల వేడుకల్లో స్థానిక మహిళలు పాల్గొన్నారు. బాలానగర్ కనకదుర్గా ఆలయం, వినాయకనగర్ వేంకటేశ్వరాలయంలోని అమ్మవారిని, మూసాపేటలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కృష్ణారావు దర్శించుకుని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల రవీందర్, మాజీ కార్పొరేటర్లు శ్రవణ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


విజయదుర్గా రామలింగేశ్వర ఆలయంలో మీనాక్షిదేవి అలంకరణలో అమ్మవారు

వైభవంగా ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ మూసాపేట కార్యాలయంలో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవ, ప్రాజెక్టు అధికారి జంధ్యాల ఉమా, కార్పొరేటర్‌లు శిరీష, సబియా పాల్గొని బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. తొలుత ఉద్యోగులు గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళా ఉద్యోగులు, పట్టణ సమైఖ్య, ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు ఆడిపాడారు. కార్యక్రమంలో సీఓలు మురళి, కిషోర్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్‌ఎంసీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు శిరీష, సబియా, ఉద్యోగులు

అల్లాపూర్: అల్లాపూర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ముద్దపప్పు బతుకమ్మ సందర్భంగా మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.


బతుకమ్మలతో సోదరీమణులు

వివాహేతర సంబంధం పెట్టుకొని..

భర్తపై దాడి చేయించిన భార్య

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య తన భర్తను వదిలించుకునేందుకు అతడిపై దాడి చేయించిన ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమిత్రానగర్‌లో నివాసం ఉండే దేశబోయిన భూపాల్, చంద్రకళ భార్యాభర్తలు. దుర్గయ్య అనే వ్యక్తితో చంద్రకళ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆమె మంగళవారం ఉదయం 7 గంటలకు పనికి వెళ్లింది. ఆమె ఇంటి నుంచి వెళ్లిన పది నిమిషాలకు నల్ల ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి వచ్చి భూపాల్‌పై దాడి చేశారు. నేలపై పడుకోబెట్టి గొంతుపై కాళ్లు ఉంచి ప్రైవేట్ పార్ట్స్‌పై కొట్టారు. ముఖం, శరీర భాగాలపై ఇనుప రింగ్‌తో కొట్టి పారిపోయారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భార్యే ఈ దాడి చేయించిందని బాధితుడు భూపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


భీరరామ్ చౌదరి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత మాదకద్రవ్యం ఓపియం అమ్ముతున్న ఓ వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జయానగర్ కమాన్ వద్ద హర్యానా జిలేబీ సెంటర్‌లో ఓపియం డ్రగ్ ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి జోధ్‌పూర్‌కు చెందిన భీరరామ్ చౌదరి (36)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 105 గ్రాములు ఉన్న ఓపియం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన వృద్ధుడు

బాలానగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి విమల్ థియేటర్ సమీపంలో ఉన్న షట్టర్స్ వద్ద ఓ వ్యక్తి(60) పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నర్సింహ రాజు ఆదేశానుసారం ఎస్ఐ మహ్మద్ హాజీమియా సంఘటనా స్థలానికి వెళ్లారు. వ్యక్తికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు యాచకుడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్ఐ తెలిపారు. అతని వివరాలు ఎవరికైనా తెలిస్తే 9490617114, 8712663384 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సీఐ నర్సింహ రాజు సూచించారు.

పేదలకు వైద్య సేవలందించడం అభినందనీయం

● కార్పొరేటర్ నర్సింహ యాదవ్

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సేవలు అందించేందుకు పుష్పగిరి ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారు ముందుకు రావడం అభినందనీయమని ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ జ్ఞాపకార్థం పుష్పగిరి ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో హస్మత్‌పేట ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 668 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అందులో 325 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ఈ నెల 26న అద్దాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. అంతకు ముందు అక్బార్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. అలాగే, తన నివాసంలో 200 మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.5లక్షల బీమా కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ఓల్డుబోయినపల్లి జలమండలి మేనేజర్ యాదగిరి, కార్మిక నాయకులు గోపినాయక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికులకు బీమా కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

● టీజీఎస్పీడీసీఎల్ డీఈ శ్యాంకుమార్

అల్లాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు టీజీఎస్పీడీసీఎల్ డీఈ శ్యాంకుమార్ తెలిపారు. అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్‌నగర్, కొత్తూరి సీతయ్యనగర్, రాధాకృష్ణ సొసైటీలలో డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగం, విద్యుత్ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. పాత విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఇళ్ల మీదుగా వెళ్లే విద్యుత్ వైర్లను తొలగించాలని స్థానికులు డీఈ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వీటినంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ ఏఈ రాకేశ్‌గౌడ్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తాం

● జడ్సీ అపూర్వ్ చౌహాన్

బాలానగర్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లోని సమస్యలను పరిష్కరిస్తామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్యాణ్‌నగర్‌లో నీట మునిగిన ప్రాంతాల్లో మంగళవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి పర్యటించారు. చరబండరాజునగర్ కాలనీ నుంచి నాలాకు డ్రైనేజీ పైప్‌లైన్‌ను అనుసంధానించడం వల్ల సమస్య తీవ్రమైందని కాలనీవాసులు జెడ్సీకి తెలిపారు. చరబండరాజు కాలనీ డ్రైనేజీ పైప్‌లైన్‌ను మార్చేందుకు చర్యలు చేపడతామని, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హైడ్రా అధికారులు, నిపుణులైన ఇంజనీర్లతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని జడ్సీ కాలనీ వాసులకు హామీనిచ్చారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు కల్యాణ్‌నగర్ ప్రజలకు అండగా ఉంటానని కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి అన్నారు. సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశ, కల్యాణ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ్‌నగర్‌లో పర్యటిస్తున్న కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్


బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో అమ్మవారు


సువర్ణాలంకరణ అవతారంలో అమ్మవారు


గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


ఇందిరానగర్‌లో దుర్గాదేవి మండపంలో అమ్మవారి పూజలో పాల్గొన్న మిర్యాల ప్రీతం

దుర్గామాతా నమోస్తుతే

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ఖేల్‌కాలనీ/ చందానగర్/ హైదర్‌నగర్/ రాయదుర్గం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని భెల్ కాలనీ, చందానగర్, హైదర్‌నగర్, రాయదుర్గం డివిజన్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. టౌన్‌షిప్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎంజీజీ కాలనీలో పోచమ్మతల్లి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఇందిరానగర్ కాలనీలో హనుమాన్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన మండపంలో మిర్యాల చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ మిర్యాల ప్రీతం ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పాపిరెడ్డికాలనీ, రాజీవ్‌గృహకల్పలోనూ దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


దుర్గాదేవి దేవాలయంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు


బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో నవరాత్రి ఉత్సవాలు


ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లోని పోచమ్మ ఆలయంలో పూజలందకుంటున్న అమ్మవారు


అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ సాయిబాబా ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

నష్ట పరిహారం అందించాలి: రైతులు

గచ్చిబౌలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల పెద్దచెరువులో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందించాలని గ్రామ రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నల్లగండ్ల పెద్దచెరువు 80ఎకరాల విస్తీర్ణంలో ఉందని, చెరువుకు 18ఎకరాల 39గుంటలు ఉందని, మిగిలిన 62.11గుంటల భూమి 60మంది రైతులదని వివరించారు. ప్రస్తుతం చెరువులో నీరు ఉండడంతో చుట్టుపక్కల వ్యవసాయం చేసుకునే పరిస్థితి లేదన్నారు. మండలం పరిధిలో మియాపూర్ పటేల్‌చెరువు, గురున్నాథం చెరువు, కాయదమ్మకుంట, ఈర్ల చెరువులో భూములు కోల్పోయిన రైతులకు కొంతమేర నష్టపరిహారం చెల్లించిన సంఘటనలు ఉన్నాయని చిన్నారెడ్డికి రైతులు వివరించారు. నల్లగండ్ల పెద్దచెరువులో భూములు కోల్పోతున్న వారికి కూడా నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, సతీష్‌యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన


శ్మశానవాటికలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

హైదర్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మ బండ హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.50లక్షలతో బర్నింగ్ ప్లాట్‌ఫాం, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, రూ.కోటి నిధులతో సిట్టింగ్ గ్యాలరీ, పూజ గది, సెక్యూరిటీ రూమ్, కాంపౌడ్ వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దహన సంస్కారాల కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. త్వరలో వాచ్‌మెన్ రూం, పూజ గది నిర్మాణ పనులు కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సమ్మారెడ్డి, రవి, మల్లేష్, షౌకత్ అలీమున్నా, ముజీబ్, అగ్రవాసు, మహేష్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రహ్మణ సేవా సంఘం
నూతన కార్యవర్గం ఎన్నిక

చందానగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మణ సేవా సంఘం శేరిలింగంపల్లి నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా సాయిలు ఎన్నికయ్యారు. నాయిబ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మంగళవారం చందానగర్ డివిజన్ గంగారంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా పర్శరాం, కార్యనిర్వాహక అధ్యక్షులుగా సత్యం, రవికుమార్‌లు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధి కోసం అందరు కలిసికట్టుగా పని చేయాలని సభ్యులు తీర్మానించారు. నాయి బ్రహ్మణ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం మాజీ అధ్యక్షుడు రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

హైటెక్‌సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా శారీస్ ఆఫ్ ఇండియా మేళా నిర్వహిస్తున్నారు. బనారస్, చెందేరి, కోట, గుజరాతి, ఉప్పాడ, కాశ్మీరీ తదితర వెరైటీల శారీస్ మహిళలకు అందుబాటులో ఉన్నాయి. నృత్య కళాకారులు మంగళవారం ఒడిశీ, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. దేబ్రసి పట్నాయక్ బృందం ఒడిశీ నృత్యంలో నవదుర్గ, స్థాయి, జగన్మోహిని తదితర అంశాలను నీలాంజన, అనన్య, స్వాతి సోనాలి, యుక్తి తదితరులు ప్రదర్శించారు.

ముంపు ముప్పు తప్పించండి..!

● హైడ్రాకు ఫిర్యాదులు


బాధితులతో మాట్లాడుతున్న రంగనాథ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైడ్రా ప్రజావాణికి మంగళవారం 49 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 30కిపైగా నాలాల ఆక్రమణలు, వరద ముంపునకు సంబంధించినవే అని సంస్థ పేర్కొంది. శేరిలింగంపల్లిలోని మియాపూర్ మయూరీనగర్‌లో అబ్బులు అనే వ్యక్తి నాలా ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, వరద నీటి ప్రవాహానికి ఇది ప్రతిబంధకంగా మారిందని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. కూకట్‌పల్లిలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కొందరు కాజేయాలని చూస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

పబ్‌లో బౌన్సర్లపై దాడి

హైటెక్ సిటీ: పబ్‌లో తాగిన వ్యక్తులు బిల్లు కట్టమంటే బౌన్సర్లను, పబ్ మేనేజరును కొట్టారు. ఈ సంఘటన మాదాపూర్ పీఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరగగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు బౌన్సర్ షేక్ ఇమ్రాన్ వివరాల ప్రకారం.. కొంతమంది వ్యక్తులు కొండాపూర్‌లోని మ్యాడ్ పబ్‌కు వచ్చి తాగగా.. వారి బిల్లు రూ.18 వేలు అయ్యింది. బిల్లు కట్టమంటే వారు కట్టమన్నారు. ఎందుకు కట్టరని అడగ్గా.. తమను, మేనేజర్ మోహన్‌ను కొట్టారు. గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్టు బౌన్సర్ పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని మాదాపూర్ సీఐ కృష్ణ మోహన్ తెలిపారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

వైకుంఠ ధామంలో మరిన్ని సదుపాయాలు

● అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



భగత్‌సింగ్ నగర్‌లోని వైకుంఠ ధామాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని వైకుంఠ ధామాన్ని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలోని వైకుంఠ ధామాలను అభివృద్ధి చేశామన్నారు. అందులో భాగంగానే భగత్‌సింగ్‌నగర్‌లోని వైకుంఠ ధామంలో మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో శ్మశాసన వాటికలో పెరిగిన మొక్కలు, పొదలను తొలగించి నీటి సౌకర్యం, స్నానాల గదుల నిర్మాణం, దహన వాటిక, స్టోర్ రూమ్, వాచ్‌మెన్ రూమ్, వాహనాల పార్కింగ్, గ్యాలరీ వంటి వసతులతో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కిష్టప్ప, డీఈ విశాలాక్షి, ఏఈలు అశోక్ కుమార్, నాగ రాజు, కార్పొరేటర్ రషీదాబేగం, స్థానిక నాయకులు కృష్ణమూర్తి, సదానందం, చింతల్, చంద్రానగర్, భగత్‌సింగ్ నగర్, తదితర కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాలనీలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోండి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల నేపథ్యంలో ఉమామహేశ్వర కాలనీలోకి ఎగువ నుంచి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలోని ఇళ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన అధికారులు , నాయకులతో కలిసి మంగళవారం కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ అధికారులు ,మున్సిపల్ మాజీ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శిరీషా ప్రవీణ్‌రావు, డప్పు కిరణ్, రవీందర్‌రెడ్డి, భూలక్ష్మణ్ , అనిల్ , కాలనీవాసులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా చూస్తా: కూన



బాధితులతో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్,సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): గాజుల రామారం డివిజన్ మిథులానగర్‌లో మూడు రోజుల క్రితం హైడ్రా అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేయడంతో ఇళ్లు కోల్పోయిన వారు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించుకొన్నారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల దృష్టికి మీ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలి'

షాపూర్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల సమస్యలకు నిలయంగా మారాయన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి హాస్టళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖుషి, మధు, సాయి, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.



సీఎంఆర్ షాపింగ్ ముందు రోడ్డుపై నిలిచిన వరద నీరు



ఎస్‌బీఐ ముందు ఏర్పడిన గుంత



అంబేడ్కర్ విగ్రహం ముందు డివైడర్ నిర్మాణం కోసం తవ్విన గుంతలో నిలిచిన నీరు

అధ్వానంగా నిజాంపేట రోడ్డు

● వర్షాలకు గుంతలు పడి ధ్వంసం
● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



జియో మార్టు ముందు రోడ్డుపై ఏర్పడ్డ గుంత

నిజాంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ ప్రధాన రహదారి భవ్యాస్ ఆనంద్ నుంచి మొదలుకొని మధ్యలో అంబేడ్కర్ విగ్రహం వద్ద , దాని తర్వాత జియో మార్ట్ ముందు, సీఎంఆర్ షాపింగ్ ముందు, ఎస్‌బీఐ ముందు, జేఆర్ వైన్స్ ముందు దాదాపు కిలో మీటరు వరకు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మధ్య కురిసిన భారీ వర్షాలు కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడటం ఒక సమస్య అయి తే, ఆ గుంతల్లో వర్షపు నీరు చేరి ఎక్కడ రోడ్డు ఉందో.. ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రోడుపై రాకపోకలు సాగిస్తున్న కార్పొరేషన్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు రోడ్డు సమస్య పరిష్కారానికి కనీస చర్యలు తీసుకోవ డం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● అదే విధంగా అంబేడ్కర్ విగ్రహం నుంచి నిజాంపేట విలేజ్ వైపు వెళ్లే రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటుకు రోడ్డును తవ్వించిన అధికారులు ఇంత వరకూ డివైడర్ నిర్మాణం చేపట్టలేదు. తవ్వి వదిలేసిన ప్రాంతంలో వర్షం నీరు చేరి, గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాల నివారణకు చరలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అంతయ్యగౌడ్ కుటుంబ సభ్యులు

మంగళగౌరిగా చిత్తారమ్మదేవి

షాపూర్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవారు మంగళగౌరిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. గాజులరామారంలోని చిత్తరమ్మ దేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలో రెండవ రోజైన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగౌరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలను అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్

నాలాలు, రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్, అధికారులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'భారీ వర్షం - రోడ్లు జలమయం' ఇళ్లలోకి చేరిన నీరు శీర్షికన ఈ నెల 19న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించిన కార్పొరేటర్ బి. విజయ్ శేఖర్‌గౌడ్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఐలా అధికారులు రంగారెడ్డినగర్ డివిజన్‌లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరినగర్‌లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా బాక్స్‌డ్రైన్ ఏర్పాటు చేసేందుకు గతంలో దాదాపు రూ. 90 లక్షలతో పనులు చేపడుతుండగా ఓ పరిశ్రమ యజమాని అడ్డుకోవడంతో వర్షం పడినప్పుడల్లా ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గాంధీనగర్ నుంచి అస్బెస్టాస్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో నీరు నిల్వడం, వెంకట్‌రామ్‌రెడ్డినగర్‌లో నాలాలో నుంచి మురుగు నీరు బయటకు ప్రవహించడంతో నాలాలోని మట్టి పేరుక పోయిందని కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్, గాంధీనగర్ ఐలా అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ అధికారుల దృష్టికి తీసుక వెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐలా మేనేజర్ భాషా, జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా, వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొ న్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: బీజేపీ

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీ పైప్‌లైన్ రోడ్డులోని విల్లాస్, ప్రసన్న నగర్, ఫస్ట్‌ఎవెన్యూ కాలనీ, వెంకన్నహిల్స్-1,2, మహానగర్ బ్రిడ్జి, ఎంఎన్‌రెడ్డినగర్, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరద నీరు రహదారులపై నిలిచి తమ ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ, అధికారుల అనాలోచిత నిర్ణయాలతోనే ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయని, ఎత్తు పల్లాలు చూసుకోకుండా కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తుండటంతో వర్షం వచ్చినప్పుడు నీరు ఎటూ వెళ్లకుండా రోడ్లపైనే ఉండిపోతున్నదని, వీలైనంత తొందరగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ పాపమ్మ, జలమండలి మేనేజర్, బీజేపీ నా యకులు ప్రభాకర్‌రెడ్డి, రాజు, కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రద్దీ కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం



ప్రొక్లెయినర్‌తో మట్టిని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

షాపూర్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద మట్టి పేరుకుపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు స్తంభం వద్ద ఉన్న మట్టిని ప్రొక్లెయినర్‌తో తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. షాపూర్‌నగర్‌లోని రంగా, బుజంగ థియేటర్ల వద్ద సుచిత్రకు వెళ్లే రోడ్డులో వాహనాలు రాకపోకలకు విద్యుత్ స్తంభం అడ్డుగా ఉండటమే కాక, రోడ్డుపై మట్టి పేరుకుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పోలీసులు మంగళవారం మట్టిని తొలిగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన కాలనీల ప్రతినిధులు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ

దుండిగల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నిత్యం అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం పలు కాలనీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు శంభీపూర్ రాజును కలిసి తమ కాలనీల్లోని సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. వెంటనే ఆయన సంబంధిత మున్సిపాలిటీ, కార్పొరేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

వైభవంగా చండీ హోమం



హోమం చేస్తున్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

నిజాంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గమ్మ ఆలయంలో కుమారిదేవి చండీ హోమం వైభవంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొలన్ భద్రారెడ్డి, బుర్రా అశోక్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.